సాక్షి
రాజన్న సిరిసిల్ల

బుధవారం, 31, మే, 2023



కొనసాగుతున్న రద్దీ
వేములవాడ: రాజన్న సన్నిధిలో భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అధికారులు ఏర్పాట్లు పరిశీలించారు.



బద్దిపోచమ్మకు బోనం
వేములవాడ: బద్దిపోచమ్మ దర్శనానికి భక్తులు బారులుతీరారు. నెత్తిన బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చి అమ్మవారికి కల్లుసాక, బోనం మొక్కులు చెల్లించుకున్నారు.

గరిష్టం/కనిష్టం
38.0/28.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది. ఎండ తీవ్రత.. ఉక్కపోత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

'ఆరోగ్య మహిళ'కు స్పందన



సుందరయ్యనగర్ ఆస్పత్రిలో కార్యక్రమం

సిరిసిల్లటౌన్: జిల్లా వైద్యారోగ్యశాఖ చేపట్టిన 'ఆరోగ్య మహిళ' శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ఈ మేరకు మంగళవారం డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు ఒక ప్రకటన విడుదల చేశారు. సిరిసిల్లలోని పీఎస్‌నగర్, వేములవాడ పీఏసీ, నేరెళ్ల పీహెచ్‌సీ, తంగళ్లపల్లి పీహెచ్‌సీల్లో మహిళలకు ఉచితంగా వైద్యరోగ్య పరీక్షలు నిర్వహించారు. వివిధ హెల్త్ సెంటర్లలో నిర్వహించిన ఆరోగ్య మహిళ శిబిరాల్లో ఓపీడీ(414), బ్రెస్ట్(410), ఆర్‌సీఎగ్జామినేషన్(413) పరీక్షలు జరిపినట్లు పేర్కొన్నారు. యూటీఐ(7), ల్యాబ్(107), థైరాయిడ్(59), విటమిన్ డీ(35), సీబీపి(84), సూక్ష్మ పోషకాలు(69) మందికి పరీక్షలు నిర్వహించి వీరిలో 12 మందిని జిల్లాసుపత్రికి రెఫర్ చేసినట్లు వివరించారు.

కార్మికుల హక్కుల రక్షణకు పోరాటం



వేడుకల్లో పాల్గొన్న నాయకులు

సిరిసిల్లటౌన్: యాభై మూడేళ్లుగా సీఐటీయూ కార్మికుల హక్కుల పరిరక్షణకు పోరాటం చేస్తోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ అన్నారు. మంగళవారం పార్టీ ఆవిర్భవ వేడుకలను సిరిసిల్ల బీవైనగర్‌లోని కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండా ఎగురవేసి ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని ఆరోపించారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను తొలగిస్తూ పెట్టుబడిదారులకు లాభం చేకూరుస్తున్నాయని విమర్శించారు. కార్మిక చట్టాలను పరిరక్షించుకోవడం కోసం ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. నక్క దేవదాసు, శ్రీరాం సదానందం, ఎలిగేటి రాజశేఖర్, రమేష్‌చంద్ర, సురేష్, ప్రభాకర్, వెంకట్రాజం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ తల్లి కల్యాణం



గంగారాజరాజేశ్వరుల కల్యాణోత్సవం

వేములవాడ: వేములవాడ పట్టణ శివారులోని మూలవాగులోని గంగమ్మ గుడిలో స్థానిక గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో మంగళవారం గంగా పార్వతీరాజరాజేశ్వర స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. గంగమ్మ తల్లి దయతో వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడిపంటలు బాగుండాలని వారంతా మొక్కుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కమిషనర్ అన్వేశ్, కౌన్సిలర్లు నరాల శేఖర్, అన్నారం ఉమ, ఇప్పపూల అజయ్, సిరిగిరి చందు, గంగపుత్ర సంఘం నాయకులు పంపరి శంకర్, దేవయ్య, గంగపుత్రులు అమ్మవారికి దర్శించుకున్నారు.

ఆమ్‌చూర్‌కు రికార్డు ధర



టెంకరను ఆరబెడుతున్న మహిళ

సిరిసిల్ల: ఆమ్‌చూర్ (మామిడి టెంకర) రికార్డు స్థాయిలో ధర పలుకుతోంది. జిల్లాలోని ఆమ్‌చూర్‌ను తయారు చేసే రైతులు నిజామాబాద్ జిల్లా మార్కెట్‌కు తరలిస్తారు. మార్కెట్‌లో రికార్డుస్థాయిలో ఆమ్‌చూర్ క్వింటాలుకు రూ.36,100 లభించడం విశేషం. మహారాష్ట్ర, హైదరాబాద్, ఢిల్లీకి చెందిన వ్యాపారులు నిజామాబాద్ మార్కెట్ నుంచి ఆమ్‌చూర్‌ను కొనుగోలు చేస్తారు. జిల్లాలో మామిడి తోటలను గుత్తకుపట్టుకున్న రైతులు కాయలను పొట్టుతీసి, టెంకర (ముక్కలుగా కోసి)గా చేసి ఆరబెట్టి మార్కెట్‌కు తరలిస్తారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ మామిడి రైతులు ఉండగా.. ఈ ఏడాది ఆమ్‌చూర్ ధర క్వింటాలుకు రూ. 20,800 ఉండడంతో ఆసక్తిగా అమ్ముకుంటున్నారు. ప్రకృతి వైపరీత్యాలతో ఇబ్బందులు పడిన మామిడి రైతులకు ఆమ్‌చూర్‌కు ధర లభించడంతో ఊరట లభించింది.

మళ్లీ తడిసిన ధాన్యం

- రైతులను భయపెడుతున్న అకాలవర్షాలు
- కొన్నిచోట్ల ఇంకా పూర్తికాని కొనుగోళ్లు
- ఉమ్మడి జిల్లాలో 11 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం
- ఇప్పటివరకు 9.5 లక్షల మెట్రిక్ టన్నుల ప్రొక్యూర్‌మెంట్
- ఆందోళన వద్దంటున్న మంత్రి కమలాకర్



పెద్దూరు కొనుగోలు కేంద్రంలో ధాన్యం నిల్వలు

జిలాపేరు	సేకరించాల్సిన ధాన్యం (లక్షల మెట్రిక్ టన్నులు)	సేకరించిన ధాన్యం (లక్షల మెట్రిక్ టన్నులు)	రైతుల సంఖ్య	కొనుగోలు చేసిన ధాన్యంవిలువ(రూ.కోట్లలో)
కరీంనగర్	2,32,467	2,41,556	40,490	497.49
జగిత్యాల	4,55,503	3,08,340	42,991	634.91
పెద్దపల్లి	3,04,846	2,37,139	29039	486.40
రాజన్నసిరిసిల్ల	1,88,513	1,71,146	27,826	352.55
మొత్తం	11,81,329	9,58,181	1,40,346	1971.35

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి జిల్లాలోని ధాన్యం సేకరణలో వేగం పెంచారు. మృగశిర కార్తె తరముకొస్తున్న వేళ.. రైతులు సాగుకు సమాయత్తం కావాల్సిన సమయంలో ఇంకా కొన్నిచోట్ల ధాన్యం కొనుగోళ్లు పూర్తికాని వైనం కలవరపెడుతోంది. సోమవారం రాత్రి, మంగళవారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షాలతో ఉమ్మడి జిల్లాలోని జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ ప్రాంతాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇంకా ధాన్యం సేకరణ పూర్తికాని ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. చాలాచోట్ల ధాన్యం సేకరణలో జాప్యంపై రైతులు ఆగ్రహించారు.

- జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలంలో ఏకంగా జాతీయ రహదారిపైకి వచ్చి ఆందోళన చేశారు.
- పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లోనూ పలువురు రైతులు రాస్తారోకోకు యత్నించారు.
- తాలు, తేమ, మట్టిబెడ్డల సాకుగా చూపుతూ నేటికీ మిల్లర్లు క్వింటాలుకు కనీసం తొమ్మిది కిలోల మేర ధాన్యం తరుగు తీస్తున్నారన్న విమర్శలు మాత్రం ఆగడం లేదు.

తొలకరి నాటికి లక్ష్యంగా..

ఓవైపు అకాల వర్షాలు రైతులను కలవర పెడుతుంటే.. మరోవైపు.. ప్రభుత్వం ధాన్యం సేకరణను వేగవంతం చేసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ జూన్ మొదటివారానికి ధాన్యం సేకరణ పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే చాలాచోట్ల కొనుగోలు కేంద్రాలు ధాన్యం కొనుగోలు పూర్తయ్యాక మూతపడ్డాయి కూడా. కరీంనగర్‌లో 341 కేంద్రాలకు 56 కేంద్రాలు, పెద్దపల్లిలో 303 కేంద్రాలకు తొమ్మిది, సిరిసిల్లలో 255కు ఐదు, 416 కేంద్రాల్లో తొమ్మిది కేంద్రాలు మూతబడ్డాయి. మిగిలిన కేంద్రాల్లోనూ వీలైనంత త్వరగా కొనుగోళ్లు పూర్తిచేయాలని మంత్రి గంగుల కమలాకర్ ఆదేశించారు. వాస్తవానికి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొత్తం 11 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటికే 9.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. మిగిలిన 2.23 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం వారంరోజుల్లోగా పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

40 రోజులుగా ఇబ్బందులు



కల్లాల్లో ధాన్యం పోసి 40 రోజులు అవుతున్నా ఇప్పటివరకు కొనుగోలు చేయడం లేదు. వర్షం కురవడంతో ధాన్యం మొత్తం తడిసిపోయింది. కొనుగోళ్లలో జాప్యం జరుగుతంది. వారానికో లారీ రావడంతో ధాన్యం తరలింపులో తీవ్ర జాప్యం నెలకొంది. వర్షాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు కొనుగోళ్లు త్వరితగతిన పూర్తిచేసేలా చూడాలి. ధాన్యం డబ్బులు సైతం సకాలంలో రావడం లేదు.

– క్యాతం రవి, రైతు, జగదేవ్‌పేట, వెల్గటూర్

లారీలు వస్తలేవు



వరి కోతకోసి 30 రోజులు అవుతుంది. ధాన్యం తూకం వేసి నాలుగు రోజులు అవుతంది. లారీలు వస్తలేవు. మంగళవారం వర్షం కురువడంతో కొన్ని వడ్లబస్తాలు తడిచిపోయినయి. అధికారులు స్పందించి లారీల కొరత తీర్చాలి. ఇప్పటికే సాగు పనులు ప్రారంభం అయ్యాయి. ఉదయం నుంచి సాయంతరం వరకూ ఇక్కడే ఉంటే పనులెలా చేసుకోవాలి?

– రాచర్ల శంకర్, పెద్దూరు, సిరిసిల్ల

రైతులను ఇబ్బందులు పెడితే చర్యలు



రైతులను ఇబ్బంది పెట్టేలా వ్యవహరించే ఏ మిల్లర్‌నూ ఉపేక్షించబోం. మభ్యపెట్టినట్లు అనిపిస్తే రైతులు మాకు ఫిర్యాదు చేయాలి. వెంటనే తగిన చర్యలు చేపడతాం. అలాగే, తడిసిన ధాన్యం విషయంలో రైతులు ఆందోళన చెందవద్దు. ధాన్యంలో 17నుంచి 20శాతం వరకు తేమ ఉంటే.. తరుగు, కోత లేకుండా కొనుగోలు చేస్తాం.

– మంత్రి గంగుల కమలాకర్

మృగశిర నాటికి కొనుగోళ్లుపూర్తి



తొలకరి సమీపిస్తున్న నేపథ్యంలో కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేశాం. ఉమ్మడి జిల్లాలో 11,81,329 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం. ఇప్పటికే 9,58,181 లక్షల మెట్రిక్ టన్నులు కొన్నాం. మరో మూడు, నాలుగు రోజుల్లో మిగిలిన ధాన్యం కొంటాం. కేంద్రాల్లో అక్కడక్కడా చిన్నచిన్న ఇబ్బందులు ఉన్నా ఎలాంటి సమస్య రానివ్వం.

– సర్దార్ రవీందర్‌సింగ్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్

కురిసిన వర్షం.. వీధులు జలమయం



సిరిసిల్ల నేతన్నచౌక్ వద్ద వర్షపునీరు ప్రవాహం



పట్టణంలో జలమయం అయిన కాలనీ

- ఇల్లంతకుంటలో అత్యధికంగా 31 మిల్లీ మీటర్ల వర్షం

సిరిసిల్ల: జిల్లాలో మంగళవారం ఉదయం జల్లులు కురిశాయి. ఎండలు, ఉక్కపోతలతో ఉక్కిరిబిక్కిరైన జనం వర్షంతో ఉపశమనం పొందారు. రోహిణీ కార్తె ప్రవేశంతోనే వానాకాలం మొదలవుతుండగా మంగళవారం ఓ మోస్తారు వర్షం పడింది. వేకువజామున ఉరుములు, మెరుపులతో మొదలైన తుంపర.. భారీ వర్షంగా మారింది. సిరిసిల్ల పట్టణంలో భారీగా పడడంతో పట్టణ వీధులు జలమయం అయ్యాయి. సంజీవయ్యనగర్ వీధి నీటితో నిండి రాకపోకలు రెండు గంటల పాటు నిలిచిపోయాయి. నేతన్న చౌక్ వద్ద నీరు నిలిచింది. వెంకంపేట రోడ్డు నీటితో నిండిపోయింది. వేములవాడ పట్టణంలోనూ వర్షం భారీగా కురిసింది. జిల్లాలో కురిసిన వర్షం వడ్ల కొనుగోళ్లకు ఇబ్బంది మారింది. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసేందుకు సిద్ధంగా ఉన్న వడ్లు తడిసిపోయాయి. వానాకాలం వచ్చినా వడ్లు తూకం వేయకపోవడంపై రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

ఇల్లంతకుంటలో అత్యధికం

అత్యధికంగా ఇల్లంతకుంట మండలంలో 31.0 మిల్లీ మీటర్ల వర్షం పడగా.. గంభీరావుపేటలో అత్యల్పంగా 0.6 మిల్లీ మీటర్ల వర్షం పడింది. రుద్రంగిలో 10.2 మిల్లీ మీటర్లు, చందుర్తిలో 9.6, వేములవాడ రూరల్‌లో 6.8, బోయినపల్లిలో 12.3, వేములవాడలో 14.1, సిరిసిల్లలో 17.9, కోనరావుపేటలో 2.1, వీర్నపల్లిలో 3.5, ఎల్లారెడ్డిపేటలో 8.0, ముస్తాబాద్‌లో 10.6, తంగళ్లపల్లిలో 1.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. జిల్లా మొత్తంగా సగటు 9.9 మిల్లీ మీటర్ల వర్షం పడింది.

రైతులు అధైర్యపడొద్దు.. ధాన్యం కొంటాం

- కలెక్టర్ అనురాగ్ జయంతి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఇల్లంతకుంట(మానకొండూర్): రైతులు అధైర్యపడొద్దు.. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేయడం జరుగుతుందని, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఇప్పటి వరకు పెద్దలింగాపూర్ గ్రామంలో 174 మంది రైతుల నుంచి 11,725 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, ఇందులో 11,089 క్వింటాళ్ల ధాన్యం రైస్‌మిల్లులకు తరలించడం జరిగిందని అన్నారు. రైతులు పండించిన ప్రతిగింజ ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని, జిల్లా నుంచి కరీంనగర్, కామారెడ్డి జిల్లాలకు ధాన్యం తరలించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయని అన్నారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి జితేందర్‌రెడ్డి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ జితేందర్‌ప్రసాద్ పాల్గొన్నారు.

పదేళ్ల బిడ్డ తెలంగాణ

- దేశానికి దిక్సూచిగా మారింది
- మిగులు విద్యుత్ సాధించాం
- ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్



మాట్లాడుతున్న వినోద్‌కుమార్

సిరిసిల్ల: తెలంగాణ పదేళ్ల బిడ్డగా.. ఎన్నో అంశాల్లో దేశానికి దిక్సూచి అయిందని ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. సిరిసిల్లలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నం స్వరాష్ట్ర సాధనను కేసీఆర్ 2001లో టీఆర్‌ఎస్ పార్టీని స్థాపించి సాధించారని వివరించారు. అంతకు ముందు 1969లోనూ రాష్ట్ర సాధన ఉద్యమాలు జరిగినా ఫలితాన్ని సాధించలేదన్నారు. 13 ఏళ్ల సుదీర్ఘ పోరాటంతో కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు మీకు కరెంట్ ఉండదు.. నీళ్లు రావు అంటూ.. ఆనాటి పాలకులు మాట్లాడారని వినోద్‌కుమార్ వివరించారు. సీఎం కేసీఆర్ ముందు చూపుతో విద్యుత్ కష్టాలను అధిగమించి రైతులకు ఉచితంగా విద్యుత్‌ను అందిస్తున్న ఏకైక రాష్ట్రంగా దేశంలోనే గుర్తింపు పొందామన్నారు. గోదావరి, కృష్ణా నదీ జలాలను ఎత్తిపోసుకుని, బీడు భూములకు మళ్లించి కోటి ఎకరాలకు సాగు నీరు అందిస్తూ.. పంటల ఉత్పత్తిలో దేశంలోనే అగ్రస్థానంలో తెలంగాణ నిలిచిందన్నారు. యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ ప్లాంట్లతో మిగులు విద్యుత్‌ను సాధించి పొరుగు రాష్ట్రాలకు విద్యుత్‌ను అందించే స్థాయికి ఎదిగామన్నారు. బడుగు బలహీన వర్గాల పిల్లలు చదువుకునే గురుకులాలు 200 ఉండేవని, అవి ఇప్పుడు వెయ్యికి పెరిగాయని, ప్రతి విద్యార్థిపై రూ.1.25 లక్షలు ఖర్చు చేస్తున్నామని వినోద్‌కుమార్ వివరించారు. పేద చురుకైన విద్యార్థులు విదేశాల్లో చదివేందుకు స్కాలర్ షిప్‌లు ఇస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రం వస్తే.. ఏమొస్తది అని ప్రశ్నించిన వారికి మన రాష్ట్రం సాధించిన పురోగతి సమాధానమన్నారు. పదేళ్ల బిడ్డ తెలంగాణ సాధించిన అభివృద్ధి.. సంక్షేమాన్ని నేటి తరానికి తెలియజేసేందుకు దశాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, ×సెస్× చైర్మన్ చిక్కాల రామారావు, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, రైతు బంధు సమితి చైర్మన్ గడ్డం నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రగతిని చాటిచెబుదాం..

రాష్ట్రంలో తొమ్మిదేళ్లలో సాధించిన ప్రగతిని చాటిచెప్పేలా దశాబ్ది ఉత్సవాలను నిర్వహించాలని ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.వినోద్‌కుమార్ కోరారు. కలెక్టరేట్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌తో దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై ఆయన మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర సాధించిన ప్రగతిని, ప్రజలకు దరి చేరిన వసతులను, గతాన్ని, ప్రస్తుతాన్ని ప్రజలకు వివరించేలా వేడుకలు నిర్వహించాలన్నారు.

దశాబ్ది ఉత్సవాలు విజయవంతం చేయాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: జూన్ 2 నుంచి 22వరకు సాగే తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు జిల్లాలో ఘనంగా నిర్వహించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాట్లపై మంగళవారం సమీక్షించారు. జూన్ 2వ తేదీ నుంచి 22వ తేదీ వరకు జరిగే ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని సూచించారు. పోలీస్‌శాఖ నిర్వహించే సురక్ష దినోత్సవం, తెలంగాణ రన్ కార్యక్రమాలను విజయవంతం అయ్యేలా కార్యచరణ రూపొందించాలని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు చేస్తున్న కృషిని, స్నేహపూర్వక విధానాన్ని, సమర్థవంతమైన సేవలను వివరించే విధంగా కార్యక్రమాలు ఉండాలన్నారు. ఆదివారం ఉదయం పోలీస్ బ్యాండ్, పోలీస్ అధికారులతో సిరిసిల్ల పట్టణంలో పెట్రోలింగ్ కార్స్, బ్లూకోల్ట్స్ వాహనాలతో ర్యాలీ నిర్వహించాలని అన్నారు. పోలీసుశాఖలో జరిగిన సంస్కరణల విశిష్టతను సభలు, కరపత్రాల ద్వారా ప్రజలకు తెలియజేయాలని సూచించారు. పోలీసుశాఖ నేతృత్వంలో యువకులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో 12న ఉదయం 6 గంటలకు తెలంగాణ రన్ కార్యక్రమం ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

బ్యాంకు లింకేజీలో మూడోస్థానం



అవార్డు అందుకుంటున్న డీఆర్‌డీవో గౌతమ్‌రెడ్డి

సిరిసిల్ల: మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించడంలో రాష్ట్రస్థాయిలో జిల్లా మూడోస్థానం సాధించింది. 2022– 2023 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా రికార్డు స్థాయిలో రుణాలు ఇప్పించారు. హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, రాష్ట్ర పీఆర్ అండ్ ఆర్‌డీ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా చేతుల మీదుగా డీఆర్‌డీవో గౌతమ్‌రెడ్డి అవార్డు అందుకున్నారు. జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు ఏ.సరిత, తదితరులున్నారు.

నందికమాన్‌కు న్యూ లుక్





వేములవాడ: దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ రాజన్నను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు స్వాగతం పలికే నందికమాన్ జంక్షన్‌ను కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధతో సుందరంగా తీర్చిదిద్దారు. మంత్రి కేటీఆర్ కలెక్టర్‌ను ప్రశంసిస్తూనే వేములవాడ దక్షిణకాశీ అని, నందికమాన్‌కు న్యూలుక్ వచ్చిందని ట్వీట్ చేశారు. నందికమాన్ వద్ద నందీశ్వరుడు, దానిచుట్టూ నాట్యమయూరాలు, నాట్యం చేస్తున్న దృశ్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. దీంతో స్థానికులు, భక్తులు మొబైల్‌లో చిత్రీకరిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలం మల్యాల రైతులు ధాన్యం కొనుగోలు చేయాలంటూ మంగళవారం ఉదయం రోడ్డెక్కారు. లారీల కొరత పేరిట ధాన్యాన్ని కంటా వేయకుండా జాప్యం చేస్తున్నారని వేములవాడ– కోరుట్ల ప్రధాన రహదారైనా మల్యాల బస్టాండ్ వద్ద వర్షంలోనే టార్పాలిన్ కవర్లు కప్పుకుని రాస్తారోకో చేపట్టారు. ఇప్పటికే వడగళ్లు, తాలు, మెడ విరుపుతో పంట దిగుబడి సగానికి పైగా తగ్గిందని, పొలాలు కోసి నెల రోజులు గడుస్తున్నప్పటికీ ధాన్యం కంటా కావడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాలు అధికమైతే వడ్లు చేతికి రాకుండా పోతాయంటూ నినాదాలు చేశారు. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోవడంతో ఎస్సై రమేశ్ సిబ్బందితో అక్కడికి చేరుకుని ధర్నా విరమించాలని రైతులను కోరారు. కలెక్టర్ వస్తేనే ఆందోళనను విరమిస్తామని రైతులు పట్టుబట్టారు. లారీల కొరత లేకుండా చూస్తామని సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఎస్సై రమేశ్ హామీ ఇవ్వడంతో విరమించారు.

క్లుప్తంగా

వృద్ధులకు టీ, స్నాక్స్ ఇచ్చిన కానిస్టేబుల్


వృద్ధులతో ముచ్చటిస్తున్న కానిస్టేబుల్ శ్రీనివాస్

ముస్తాబాద్(సిరిసిల్ల): అమ్మా ఎలా ఉన్నావు.. తాత బాగేనా అంటూ ముస్తాబాద్ మండలంలోని మోహినికుంటలో కానిస్టేబుల్ బాల శ్రీనివాస్ వృద్ధులను ఆప్యాయంగా పలకరించారు. గ్రామంలో నిత్యం సాయంత్రం సర్పంచు వనజ ఆధ్వర్యంలో వృద్ధులకు టీ, స్నాక్స్ ఇస్తున్నారు. అయితే మంగళవారం సాయంత్రం కానిస్టేబుల్ తనవంతుగా వారికి టీ, స్నాక్స్ అందించారు. వారి కష్టసుఖాలు తెలుసుకున్నారు. వృద్ధులతో కలిసి టీ, స్నాక్స్ తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. మోహినికుంటకు వచ్చి, తమ కోసం సమయం కేటాయించిన ఆయనకు వృద్ధులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇద్దరి మృతికి కారణమైన డ్రైవర్‌పై కేసు

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని కొలనూర్ శివారులో రోడ్డుపై లారీని నిలిపి, ఇద్దరి మృతికి కారణమైన డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గత ఆదివారం రాత్రి కొలనూర్ శివారులో జరిగిన ప్రమాదంలో నిమ్మపల్లికి చెందిన అనుముల ఓజెలు, నాగరాజు మృతి చెందారు. ఓజెలు కుమారుడు రవి ఫిర్యాదు మేరకు డ్రైవర్ గంగుల స్వామి (సిరిసిల్ల)పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. బాధిత కుటుంబాన్ని టీఆర్ఎస్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, సర్పంచు కదిరె శ్రీనివాస్, ఉపసర్పంచ్ దొంత రవేణి శ్రీనివాస్ తదితరులు మంగళవారం పరామర్శించారు.

'ఉపాధి' పని చేస్తూ.. కుప్పకూలాడు

- ధర్మారంలో కూలీ మృతి


చంద్రయ్య (ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని ధర్మారంలో ఉపాధిహామీ పని చేస్తూ ఓ కూలీ అకస్మాత్తుగా మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. ధర్మారం గ్రామానికి చెందిన మల్లెవేణి చంద్రయ్య(55) మంగళవారం ఉపాధిహామీ పనికి వెళ్లాడు. అల్లం తోట బోరు వద్ద పని చేస్తున్న ఆయన ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గమనించిన తోటి కూలీలు లేపిచూసేసరికి మృతిచెందాడు. గుండెపోటుతో చనిపోయి ఉంటాడని భావిస్తున్నారు. మృతుడికి భార్య భాగ్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. చంద్రయ్యది నిరుపేద కుటుంబమని, ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచు గున్నాల అరుణ కోరారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి


మృతిచెందిన గేదెల వద్ద రైతు

జగిత్యాలరూరల్: మండలంలోని అంతర్గాంలో విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతిచెందాయి. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన మతలపురం ఆనంద్ అనే రైతు తన రెండు గేదెలను పశువుల కొట్టంలో కట్టేశాడు. సోమవారం రాత్రి భారీగా వీచిన ఈదురుగాలులతో విద్యుత్ తీగలు తెగి, గేదెలపై పడటంతో విద్యుదాఘాతం సంభవించి, అక్కడికక్కడే మృతిచెందాయి. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ ఏఈ అయిలయ్య మంగళవారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

ఆగివున్న వాహనాలు.. ప్రమాదాలకు కారణాలు

- మరమ్మతుకు గురైతే రోడ్డుమీద, పక్కన నిలుపుదల
- పార్కింగ్ నిబంధనలు పాటించని యజమానులు, డ్రైవర్లు
- ఈ ఏడాది ఇప్పటివరకు 8 ప్రమాదాలు
- జిల్లాకు చెందిన ముగ్గురు మృతి, పలువురికి గాయాలు

"ఈ నెల 28న రాత్రి రాజన్న గొల్లపల్లి నుంచి వడ్ల లోడ్‌తో వస్తున్న లారీ మార్గదర్శి పాఠశాల వద్ద మరమ్మతుకు గురై, అక్కడే ఆగిపోయింది. రోడ్డుమీదే లారీని నిలిపిన డ్రైవర్ పార్కింగ్ లైట్లు వేయలేదు. పైగా వర్షం పడుతుందని భావించి, దానిపై నల్లటి కవర్ కప్పాడు. అదే సమయంలో నిమ్మపల్లికి చెంది ముగ్గురు కుటుంబసభ్యులు శుభకార్యానికి వెళ్లి, బైక్‌పై తిరిగి వస్తున్నారు. రాత్రివేళలో అక్కడ లారీ ఉన్నట్లు తెలియకపోవడంతో ఢీకొట్టారు. ఈ ఘటనలో ఇద్దరి తలకు బలమైన గాయాలవడంతో మృతిచెందారు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. లారీడ్రైవర్ చేసిన చిన్న పొరపాటు ఇద్దరు ప్రాణాలను బలితీసుకుంది."

ఈ ఒక్క సంఘటనే కాదు కోనరావుపేట మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల రోడ్డు ప్రమాదాలు ఎక్కువ అవుతున్నాయి. ఆగివున్న వాహనాలను ఢీకొట్టడంతో గాయాలపాలవుతున్నారు.


కోనరావుపేటలో రోడ్డు ప్రమాద దృశ్యం (ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని పోలీసులు పదే పదే గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు.వాహన తనిఖీల్లో హెల్మెట్ పెట్టుకొని, మిగతా కాగితాలు లేకున్నా వదిలిపెడుతున్నారు. అన్ని కాగితాలూ ఉండి, హెల్మెట్ లేకున్నా జరిమానా విధిస్తున్నారు. అయినా పలువురు వాహనదారులు పట్టించుకోకుండా హెల్మెట్ పెట్టుకోవడం లేదు.

పార్కింగ్ లైట్లు వేయడం లేదు..

ఆగివున్న వాహనాల వల్లే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. మరమ్మతుకు గురైనప్పుడు రోడ్డు పక్కన ఆపుతున్న యజమానులు, డ్రైవర్లు నిబంధనలు పాటించడం లేదు. పార్కింగ్ లైట్లు వేయకుండా, ఎలాంటి సూచిక ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో రాత్రివేళల్లో నడుస్తున్న ఇసుక ట్రాక్టర్ల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఇటీవల జరిగిన ప్రమాదాలు..

- మే 15న కొలనూర్ శివారులో ఆగివున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో కోనరావుపేటకు చెందిన బొమ్మ సాకేత్, మాందాల జాషువాలు తీవ్రంగా గాయపడ్డారు.
- మే 16న చంద్రంపేటలో జరిగిన ప్రమాదంలో కనగర్తికి చెందిన బొల్లం అనిల్ తలకు తీవ్ర గాయాలయ్యాయి.
- మార్చి 25న వెంకట్రావుపేట–కొండాపూర్ మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో వీర్నపల్లి మండలం గర్జనపల్లి(జవహర్‌లాల్ నాయక్ తండా)కు చెందిన భూక్య పండరి, అజ్మీరా సుజాత (కెలోత్ తండా, వన్‌పల్లి) గాయపడ్డారు.
- ఏప్రిల్ 23న కోనరావుపేట క్రాసింగ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో శివంగాలపల్లికి చెందిన పుట్ట లచ్చవ్వతోపాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి.
- ఏప్రిల్ 26న మరిమడ్ల శివారులో ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తాటిపెల్లికి చెందిన ఆనందం మృతి చెందాడు.
- ఏప్రిల్ 26న నిమ్మపల్లికి చెందిన డప్పుల రాములు హుస్సేన్‌నగర్ ప్రాంతంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు.
- మల్కపేట వద్ద ఆటో ప్రమాదంలో జంగిటి అంజయ్య మృతి చెందాడు.
- ఫిబ్రవరి 24న నిజామాబాద్ ఎల్లమ్మ టెంపుల్ వద్ద జరిగిన ప్రమాదంలో మామిడిపల్లికి చెందిన తిరుపతి గాయపడ్డాడు.
- జనవరి 12న కోనరావుపేట మండలంలోని వట్టిమల్లలో ఆటో బోల్తాపడి, 8 మంది కూలీలు గాయపడ్డారు.

తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి



జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో చాలా వరకు హెల్మెట్ పెట్టుకోకపోవడం లేదా మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లే అవుతున్నాయి. మృతుల్లో ఎక్కువ మంది తలకు గాయాలు కావడంతోనే మరణిస్తున్నారు. వాహనదారులు బయటకు వెళ్లినప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. మద్యం సేవించి వాహనాలు నడపొద్దు. ప్రమాదాల నివారణకు రోడ్డుకిరువైపులా స్తంభాలకు రేడియం స్టిక్కర్లు వేయిస్తున్నాం.

– రమాకాంత్, ఎస్సై, కోనరావుపేట

మలేషియా వీసాల మోసం ఎవరిది?

- ఏజెన్సీ అధికారిక గుర్తింపు ఒకరి పేరిట.. ఆర్థిక లావాదేవీలు మరొకరివి
- ఆదిత్య మ్యాన్‌పవర్ కన్సల్టెన్సీ తీరు
- అయోమయంలో 15 మంది బాధితులు



సిరిసిల్లలోని ఆదిత్య మ్యాన్‌పవర్ కన్సల్టెన్సీ

సిరిసిల్ల క్రైం: జిల్లా కేంద్రంలో నడుస్తున్న ఆదిత్య మ్యాన్ పవర్ కన్సల్టెన్సీలో అధికారిక గుర్తింపు ఒకరిది కాగా ఆర్థిక లావాదేవీలన్నీ మరొకరివిగా సాగుతున్నట్లు సమాచారం. మలేషియా వీసాల పేరిట మోసం జరిగిందంటూ సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో దూస రమేశ్ సోమవారం ఫిర్యాదు చేశాడు. దీంతో చెన్నైకి చెందిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కానీ ఇదంతా పక్కా ప్లాన్‌తో బాధితులను బురిడీ కొట్టించేందుకు జరుగుతున్న తంతు అని జిల్లాలో చర్చ జరుగుతోంది. మలేషియా వెళ్లేందుకు ఆదిత్య మ్యాన్‌పవర్ కన్సల్టెన్సీకి 15 మంది పాస్‌పోర్టులు, నగదు అప్పగించారు. అధికారిక ఏజెన్సీగా ఉన్న కంపెనీ ప్రతీ రూపాయి లావాదేవీకి రసీదు అందించాలన్నది నిబంధన. కానీ అదేదీ లేకుండా తాము చెన్నైకి చెందిన ఇద్దరిని నమ్మి 15 పాసుపోర్టులు, రూ.6 లక్షలు ఇచ్చినట్లు మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న దార్నం శ్రీనివాస్ మీడియాకు తెలిపారు. ఆదిత్య మ్యాన్‌పవర్ కన్సల్టెన్సీ దూస రమేశ్ పేరిట ఉందని అతనే అన్ని విషయాలు చూస్తారన్నారు. దీనిపై రమేశ్‌ను అడిగితే తన పేరిట గుర్తింపు ఉన్న మాట వాస్తవమే కానీ ఆర్థిక లావాదేవీలన్నీ శ్రీనివాస్ చూస్తారంటూ దాటవేశారు. మ్యాన్‌పవర్ కన్సల్టెన్సీలో వివిధ దేశాలకు కార్మికులను పంపే సమయంలో అధికారిక గుర్తింపు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన రసీదులు, ఏడాదికి ఎంత మంది పంపించేందుకు అవకాశం ఉంది అనే ప్రశ్నలకు నిర్వాహకుల వద్ద సమాధానాలు లేవు.

తప్పించుకునేందుకే ముందుగా ఫిర్యాదు..

మలేషియాకు సంబంధించి వీసాలన్నీ నకిలీవని తెలిసిన ఏజెన్సీ నిర్వాహకులు ఈ విషయం బయటకు తెలిస్తే తమను నమ్మి డబ్బులు పెట్టిన వారంతా ఏజెన్సీ మీద పడతారన్న ముందస్తు సమాచారంతో చెన్నై వారి చేతిలో మోసపోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతేకాదు ఏజెన్సీలో ఎండీగా వ్యవహరిస్తున్న శ్రీనివాస్ డబ్బులను రికవరీ చేయడానికి చెన్నై వెళ్లినట్లు మీడియాకు తెలిపారు. పోలీసు కేసు నమోదైతే ఇక ఈ వ్యవహారమంతా కోర్టు పరిధిలోకి వెళ్తుందని, దీంతో బాధితులెవరైనా తమ వద్దకు వస్తే తామే మోసపోయినట్లు చెప్పి, చేతులు దులుపుకునే దారిని ఎంచుకున్నట్లు సమాచారం. గతంలోనూ ఇలాంటి ఘటనలు జరగగా వారందరినీ ఎలాగోలా వివిధ దేశాలకు పంపించిన దాఖలాలున్నాయి. డబ్బులు పెట్టి, వేచిచూస్తున్న ప్రస్తుత బాధితులను కూడా అదే విధానంలో ఏదో ఒక దేశానికి పంపిస్తారన్న చర్చ జిల్లాలో జరుగుతోంది.

వేతన సవరణలో ఐఎన్‌టీయూసీ కీలక పాత్ర



కమాన్‌పూర్(మంథని): దేశవ్యాప్తంగా బొగ్గు గనుల్లో పని చేస్తున్న మూడు లక్షలకు పైగా కార్మికులకు మెరుగైన వేతన సవరణ చేయడంలో ఐఎన్‌టీయూసీ కీలకపాత్ర పోషించిందని జాతీయ కార్యదర్శి, వేజ్ బోర్డు సభ్యుడు జనక్‌ప్రసాద్ అన్నారు. ఆర్జీ–3 పరిధి ఓసీపీ–2లో మంగళవారం ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. వేతన సవరణలో ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి క్రియాశీలక పాత్ర పోషించి దేశంలో ఏ ప్రభుత్వ రంగ సంస్థలో లేని విధంగా బొగ్గు సంస్థలో 19 శాతం మినిమమ్ గ్యారెంటీ బెనిఫిట్ సాధించడం జరిగిందన్నారు. రిటైర్డ్ కార్మికుల పెన్షన్, కాంట్రాక్టు కార్మికుల హైపవర్ కమిటీ వేతనాల గురించి చర్చించి స్టాండర్డ్ డైజేషన్ కమిటీలో నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. అండర్‌గ్రౌండ్ అలవేన్స్ 9 నుంచి 11.25 శాతం సాధించుకోవడం జరిగిందన్నారు. గతంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన మాటా ప్రకారం సింగరేణిలో పేరు మార్పు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. అనంతరం ఏఐసీసీ కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఐఎన్‌టీయూసీ ఆర్జీ–3 ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కుమారస్వామి, ధర్మపురి, వికాస్‌కుమార్, అక్బర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత


సురేష్‌కు ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై రమేష్

చందుర్తి(వేములవాడ): మండలంలోని మూడపల్లికి చెందిన సంటి సురేశ్ తన ఫోన్ పోగొట్టుకున్నానని మంగళవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని ఎస్సై రమేష్ తెలిపారు. వెంటనే పోలీస్ యాప్ ద్వారా సదరు సెల్‌ఫోన్‌ను వెతికి, బాధితుడికి అప్పగించినట్లు పేర్కొన్నారు. ఎవరైనా ఫోన్ పోగొట్టుకుంటే సంబంధిత వివరాలతో తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

సైబర్ క్రైం కేసు

జ్యోతినగర్(రామగుండం): క్రెడిట్ కార్డు నుంచి ఖాతాలోకి రూ.20 వేలు మార్చుకోగా అవి ఖాతాలో కనిపించకపోవడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో సైబర్ క్రైం కేసు నమోదైంది. వివరాలు.. ఎన్టీపీసీ రామగుండం కృష్ణానగర్‌కు చెందిన వర్దే శ్రీను జనవరిలో క్రెడిట్ కార్డు నుంచి తన ఖాతాలోకి డబ్బుల జమ చేసుకునే క్రమంలో అవి ఖాతాలో జమకాలేదు. గూగుల్‌లో సెర్చ్ చేసే సమయంలో క్రెడా యాప్‌నకు సంబంధించిన ఓ వ్యక్తి ఫోన్ ద్వారా వివరాలు తెలుసుకుని డబ్బులు ఖాతాలోకి రావాలంటే పూర్తి వివరాలను సంబంధిత ఫైల్‌లో నమోదు చేసి పంపాలని సూచించాడు. దీంతో శ్రీను కార్డు వివరాలను పంపించడంతో రెండుసార్లు మొత్తం రూ.29,400 తన ఖాతా నుంచి ఇతరుల ఖాతాలోకి వెళ్లడంతో మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సైబర్ క్రైం కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనారోగ్య కారణాలతో వృద్ధుడి ఆత్మహత్య

సారంగాపూర్(జగిత్యాల): మండల కేంద్రానికి చెందిన బొల్లి మల్లయ్య (85) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మనోహర్‌రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మల్లయ్య కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఆయన భార్య పదేళ్ల క్రితమే చనిపోయింది. అనారోగ్య సమస్యలతో మనస్తాపానికి గురైన మల్లయ్య మంగళవారం ఇంట్లోని కిటికీకి తాడుతో ఉరేసుకున్నాడు. ఆయన మనవరాలు గమనించి, బిగ్గరగా అరవడంతో కుటుంబసభ్యులు వచ్చి, మెడకున్న తాడును తొలగించారు. కానీ అప్పటికే మల్లయ్య మృతిచెందాడు. మృతుడి కుమారుడు ఆశయ్య ఫిర్యాదు మెరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వాహన షోరూం యజమాని బలవన్మరణం

కథలాపూర్(వేములవాడ): కథలాపూర్, మేడిపెల్లి మండల కేంద్రాల్లో హీరో షోరూంలు నిర్వహిస్తున్న యజమాని పబ్బని నరేశ్(38) హైదరాబాద్‌లో మంగళవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. షోరూం నిర్వహణలో ఆర్థిక నష్టాలు రావడంతో 15రోజులుగా మొబైల్ ఫోన్ స్విచ్ఛాప్ చేసుకున్నారు. లాటరీల ద్వారా బైక్‌లు బహుమతిగా అందిస్తామనే విషయంలో నష్టాలు రావడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు. నరేశ్‌కు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఆయన మృతితో కథలాపూర్, మేడిపెల్లి మండలాల్లో లాటరీ డబ్బులు చెల్లించిన సుమారు 500 మంది ఆందోళనకు గురవుతున్నారు. మెట్‌పల్లి పట్టణంలోని చైతన్యనగర్‌లో కుటుంబసభ్యులతో కలిసి నరేశ్ నివాసం ఉండేవారు.

డబ్బులు, భూమి కోసమే హతమార్చారు

- దాచారంవాసి శంకర్‌ను చంపింది ఆయన భార్యే
- సహకరించిన కుమారుడు
- ఇద్దరినీ అరెస్టు చేసిన పోలీసులు


హత్య వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఉపేందర్

సిరిసిల్ల క్రైం: కష్టసుఖాల్లో కడవరకు తోడు ఉండాల్సిన భార్య.. వృద్ధాప్యంలో నేనున్నానంటూ చేదోడువాదోడుగా ఉండాల్సిన కొడుకు ఇద్దరూ కలిసి డబ్బులు, భూమి కోసం తమ ఇంటి పెద్దను హత్య చేశారు. ఇల్లంతకుంట మండలంలోని దాచారం గ్రామానికి చెందిన దర్పిపల్లి శంకర్‌ను ఆయన భార్యే హతమార్చిందని, ఇందుకు వారి కుమారుడే సహకరించాడని సీఐ ఉపేందర్ తెలిపారు. సంబంధిత వివరాలను సిరిసిల్ల రూరల్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఆయన వెల్లడించారు. శంకర్(55) వ్యవసాయం చేసేవాడు. కుటుంబంలో కొన్ని వివాదాల వల్ల ఆయన భార్య చంద్రకళ, వీరి ముగ్గురు సంతానం సిద్దిపేటలో నివాసం ఉంటున్నారు. ఈ నెల 5వ తేదీన చిన్న కూతురు వివాహం కారణంగా కుటుంబీకులందరూ ఒక్కటయ్యారు. పెళ్లి కోసం శంకర్ తన వ్యవసాయ భూమి విక్రయించాడు. రూ.46 లక్షలు రాగా అందులో నుంచి పెళ్లి కోసం రూ.13 లక్షలు ఖర్చు చేశాడు. మిగతా డబ్బుల విషయంలో కుటుంబ సభ్యుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో డబ్బులు, వ్యవసాయ భూమి తమకు దక్కాలంటే శంకర్ అడ్డు తొలగించుకోవాలని ఆయన భార్య చంద్రకళ, కుమారుడు వంశీకృష్ణ భావించారు. శంకర్ హత్యకు కుట్రపన్నారు. పక్కగా ప్లాన్ చేసి, ఆదివారం రాత్రి ఆయన మద్యం మత్తులో ఉండగా కత్తితో పొడిచి, గొంతునులిమి చంపేశారు. శంకర్ మృతి చెందినట్లు స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఎస్సై రాజేశ్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుని చెల్లెలు గొల్లపల్లి సుగుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చంద్రకళ, వంశీకృష్ణలపై కేసు నమోదు చేశారు. హంతకులను మంగళవారం ఉదయం అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచారు. జడ్జి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఉపేందర్ తెలిపారు.

'ఉపాధి' పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర


కార్మికులతో మాట్లాడుతున్న నాగరాజు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని సీపీఐ అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సోమ నాగరాజు ఆరోపించారు. మంగళవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని బతుకమ్మ చెరువు వద్ద జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించి, కూలీలతో మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. ఉపాధి పనులను రోజుకు రెండుసార్లు ఫొటోలు తీసే నిబంధన తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తీవ్రమైన ఎండలో ఉదయం, సాయంత్రం పని చేయాలని ఆదేశించడం సరికాదన్నారు. పెండింగ్ వేతనాలను చెల్లించాలన్నారు. రోజుకు రెండు పూటలా పనిచేసినా రూ.100 నుంచి రూ.200 కూడా రావడం లేదని, కనీస వేతనం అమలయ్యేలా చూడాలని కోరారు. పని ప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశం, శ్రీనివాస్, రాజు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గుడిసెలు కూల్చడం దుర్మార్గపు చర్య


మాట్లాడుతున్న శ్రీరాం సదానందం

సిరిసిల్లటౌన్: జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ భూముల్లో నిరుపేదలు గుడిసెలు వేసుకుంటే కూల్చివేయడం దుర్మార్గపు చర్య అని సీపీఎం జిల్లా నాయకుడు శ్రీరాం సదానందం అన్నారు. మంగళవారం సిరిసిల్లలోని పార్టీ ఆఫీసులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గూడులేని ప్రజలు 50 రోజుల క్రితం ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుంటే ప్రభుత్వం పోలీసులు, రెవెన్యూ అధికారులతో దాడులు చేయించిందని ఆరోపించారు. గుడిసెలను కూల్చి, మంచినీటి కోసం తవ్వుకున్న బావి పూడ్చేశారని మండిపడ్డారు. బాధితులు తమకు జరిగిన అన్యాయాన్ని అధికారులకు మొరపెట్టుకోవడానికి వెళ్తే అరెస్టు చేయించడం శోచనీయమన్నారు. ఇదంతా ప్రజలు గమనిస్తున్నారని సరైన సమయంలో గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. అరెస్టయిన పేదలు, సీపీఎం నాయకులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు నక్క దేవదాసు, ఒగ్గు గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

భూ తగాదాతో టవర్ ఎక్కిన యువకుడు


రవికి కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై వెంకటేశ్వర్లు

ముస్తాబాద్(సిరిసిల్ల): కుటుంబ సభ్యులతో ఏర్పడిన భూతగాదాను పరిష్కరించాలని కోరుతూ ఓ గిరిజన యువకుడు సెల్ టవర్ ఎక్కాడు. ఎస్సై వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. ముస్తాబాద్ మండలంలోని సేవాలాల్‌తండాకు చెందిన ధరంసోత్ రవినాయక్ సోదరుల మధ్య కొన్నేళ్లుగా భూ వివాదం నడుస్తోంది. ఇరువర్గాల వారు పలుమార్లు పంచాయితీ నిర్వహించినా సమస్య పరిష్కారం కాలేదు. రెండు రోజులుగా గొడవలు తారస్థాయికి చేరాయి. దీంతో మనస్తాపానికి గురైన రవినాయక్ ముస్తాబాద్ చేరుకొని, తమ సమస్య పరిష్కరించాలంటూ సెల్ టవర్ ఎక్కాడు. సమాచారం అందుకున్న ఎస్సై వెంకటేశ్వర్లు సంఘటన స్థలానికి చేరుకున్నారు. నిబంధనల ప్రకారం భూ సమస్య పరిష్కారమయ్యేలా చూస్తామని హామీ ఇవ్వడంతో బాధితుడు కిందికి దిగాడు. పోలీసులు అతన్ని ఆసుపత్రికి తరలించారు. సమస్య పరిష్కరించాలని తాము కోరితే తమ బంధువులు దాడులు చేస్తున్నారని రవి భార్య రేఖ ఆవేదన వ్యక్తం చేసింది.


చెట్టును ఢీకొన్న వరి ధాన్యం లారీ

- క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్
- గంటపాటు నరకయాతన
- అతివేగమే ప్రమాదానికి కారణం


లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్

కథలాపూర్(వేములవాడ): వరి ధాన్యం తరలిస్తున్న ఓ లారీ కోరుట్ల–జగిత్యాల ప్రధాన రహదారిపై మేడిపెల్లి శివారులో చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్ లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లాకేంద్రానికి చెందిన డ్రైవర్ తిప్పని సందీప్ మంగళవారం రాత్రి వరి ధాన్యం బస్తాలను చెన్నూర్ నుంచి ఆదిలాబాద్‌కు లారీలో తీసుకెళ్తున్నాడు. వాహనాన్ని వేగంగా నడపడంతో మేడిపెల్లి శివారులో మూలమలుపు వద్ద చెట్టు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముందుభాగం నుజ్జునుజ్జయ్యి, డ్రైవర్ అందులోనే ఇరుక్కుపోయాడు. దాదాపు గంటపాటు నరకయాతన అనుభవించాడు. డీజిల్ ట్యాంక్ పగిలి, డీజిల్ రోడ్డుపై పారడంతో స్థానికులు ఫైరింజిన్‌ను పిలిపించి, నీళ్లు చల్లించారు. కానిస్టేబుళ్లు చంద్రశేఖర్, సందీప్‌గౌడ్‌లు జేసీబీ సహాయంతో డ్రైవర్‌ను బయటకు తీశారు. అతను తీవ్రగాయాలతో స్పృహతప్పి పడిపోవడంతో చికిత్స నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై సతీశ్ చేరుకొని, సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు మేడిపెల్లి ఎస్సై చిరంజీవి పేర్కొన్నారు.

గోశాలకు కోడెలు అందజేత


కోడెలు అప్పగిస్తున్న అధికారులు

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్ రాజన్న గోశాలలోని కోడెలను మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం జీకేతండాకు చెందిన శ్రీ సోమేశ్వరగోశాలకు అప్పగించారు. సుమారు 20 కోడెలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు శ్రీనివాస్, హరిహరనాథ్, శ్యామ్, శంకర్ తదితరులు ఉన్నారు.

గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం అర్హత పొందిన విద్యార్థులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.రజని ఒక ప్రకటన ద్వారా తెలిపారు. టీజీయూజీసెట్ 2023 అర్హత సాధించి ఆన్‌లైన్ ద్వారా కళాశాలలో అడ్మిషన్ పొందిన విద్యార్థులు సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలతో వారికి కేటాయించిన తేదీల్లో కళాశాలకు వచ్చి రిపోర్ట్ చేయాలని కోరారు. మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.